సాక్షి
వికారాబాద్
మంగళవారం । 16 । మే । 2023



ఊపందుకున్న వరి కోతలు
దౌల్తాబాద్ మండలంలో వరి కోతలు కొంత ఆలస్యంగా ప్రారంభమైనా ప్రస్తుతం ఊపందుకున్నాయి. 8లో▸



క్రీడల్లో సత్తా చాటాలి
గ్రామీణ యువత క్రీడల్లో సత్తా చాటాలని యూత్ వెల్ఫేర్ జిల్లా అధికారి హన్మంత్‌రావు సూచించారు. 8లో▸



వణుకు పుట్టిస్తున్న వానరాలు
గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా వానరాలు వణుకు పుట్టిస్తున్నాయి. పంటలు, ఇళ్లను పాడు చేస్తున్నాయి. 9లో▸

తొలి వందనం

మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్

- వికారాబాద్‌కు వంద సీట్లు కేటాయింపు
- ఆగస్టులో అడ్మిషన్లకు చాన్స్
- ఏరియా ఆస్పత్రి భవనంలో తాత్కాలిక కళాశాల
- చకచకా సాగుతున్న పనులు
- శాశ్వత భవన నిర్మాణానికి రూ.234 కోట్లు మంజూరు



కొనసాగుతున్న ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణ పనులు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో మెడికల్ కాలేజీ పనులు ఊపందుకున్నాయి. కళాశాల ఏర్పాటుకు జాతీయ వైద్య కమిషన్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో పనులు చకచకా సాగుతున్నాయి. వైద్య కళాశాల ఏర్పాటుతో జిల్లాలోని విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి రావడంతో పాటు వైద్య సేవలు మెరుగుపడనున్నాయి. ఇప్పటికే అనంతగిరి టీబీ శానిటోరియంలోని పలు భవనాలను తరగతి గదులుగా మార్చే ప్రక్రియ పూర్తయింది. రాజీవ్‌నగర్‌లోని ఆస్పత్రి నిర్మాణం పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. గత నెల 9న జాతీయ వైద్య కమిషన్ నుంచి అనుమతులు మంజూరు కావడంతో వైద్య శాఖ అధికారులు ఏర్పాట్లు వేగిరం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అనంతగిరిలో టీబీ శానిటోరియం వార్డులు, తాత్కాలిక క్లాస్ రూంలు, ల్యాబ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏరియా ఆస్పత్రినే అప్‌గ్రేడ్

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్‌లో కాలనీలో నేషన్ హెల్త్ మిషన్ కింద వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి గతంలోనే ప్రభుత్వం ఒక అంతస్తు భవనాన్ని నిర్మించింది. అతర్వాత తొమ్మిది జిల్లాలకు మంజూరు చేసిన మెడికల్ కాలేజీల జాబితాలో వికారాబాద్‌కు చోటు దక్కింది. దీంతో వంద పడకల ఆస్పత్రిని నాలుగు అంతస్తులుగా నిర్మించి సుమారు 380 పడకలకు పెంచాలని నిర్ణయించారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.34 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులన్నీ చకచకా సాగుతున్నాయి. భవన నిర్మాణం పూర్తిగా వైద్య కళాశాలకు అనుగుణంగా మార్పు చేస్తున్నారు. మెడికోలకు ప్రాక్టికల్స్‌పై ఇక్కడే శిక్షణ ఇవ్వనున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి, కాలేజీ ప్రిన్సిపల్ నాగమణి పలుమార్లు పనులను పరిశీలించారు. ఆగస్టులో అడ్మిషన్లు ప్రారంభమయ్యే అవకాశం ఉండటంతో జూన్ లేదా జూలై రెండో వారంలోపు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు చేయిస్తున్నారు.

త్వరలోనే పూర్తిస్థాయి సిబ్బంది

2023- 24 విద్యా సంవత్సరంలో జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో వంద మందికి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పించనున్నారు. అనంతరం ఏటా కొత్తగా వంద సీట్లు కేటాయిస్తారు. ఇప్పటికే ఎన్ఎంసీ బృందం జిల్లాలో సర్వే నిర్వహించింది. విద్యార్థులతో పాటు కళాశాలకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నిర్వహణ, బోధన సిబ్బందిని కూడా త్వరలో కేటాయించనున్నారు. ఇప్పటికే యాభైశాతం మంది ప్రొఫెసర్లు, ప్రత్యేక వైద్య నిపుణులను కేటాయించారు. కాలేజీకి అనుబంధంగా ఏరియా ఆస్పత్రితో పాటు మరో రెండు పీహెచ్‌సీలను అనుసంధానం చేసే అవకాశం ఉంది.

30 ఎకరాల స్థలం

ప్రభుత్వ వైద్య కళాశాలకు శాశ్వత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం 30 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ ఏడాది వైద్య తరగతులు మాత్రం తాత్కాలిక భవనాల్లోనే కొనసాగుతాయి. పర్మినెంట్ భవన నిర్మాణానికి రూ.234 కోట్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి టెండర్లు పూర్తి చేసి, పనులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంతవరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

అత్యవసర వైద్య సేవలు

జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. తాండూరు, వికారాబాద్‌లో ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నా రాత్రి సమయాల్లో వైద్యులు ఉండరు. ముఖ్యంగా రాత్రి వేళ జరిగే రోడ్డు ప్రమాదాల్లో చాలా మందికి సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. మెడికల్ కళాశాల ఏర్పడితే ఎమర్జెన్సీ సేవలు లభించే అవకాశం ఉంటుంది. పూర్తి స్థాయిలో కాలేజీ అందుబాటులోకి వస్తే ఖరీదైన శస్త్ర చికిత్సలు కూడా ఇక్కడే చేస్తారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



బైక్ ర్యాలీలో ఎస్పీ, కలెక్టర్

అనంతగిరి: వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా సోమవారం పోలీసులు నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయం వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ కోటిరెడ్డి సైతం వాహనాలు నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మితిమీరిన వేగం ప్రాణాలను హరిస్తుందని తెలిపారు. ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించిన తర్వాతే బైక్ స్టార్ట్ చేయాలని సూచించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత పోలీసు వ్యవస్థ సామాజిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిసారించిందని తెలిపారు. సురక్షితంగా ప్రయాణం కొనసాగాలన్నా.. ఇంటికి క్షేమంగా చేరాలన్నా హెల్మెట్ వాడకం తప్పనిసరి అని వివరించారు.వేగంగా వెళ్లాలన్న ఆలోచన కన్నా..మీపై ఆధారపడిన కుటుంబాలు ఇబ్బంది పడకుండా క్షేమంగా ఇంటికి చేరడం ప్రధానమనే విషయాన్ని గుర్తించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే సురక్షితంగా ఉంటామని తెలిపారు.

మానవ తప్పిదాలతోనే..

ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. సాయంత్రం 6- 9గంటల మధ్య కాలంలోనే ఎక్కువ యాక్సిడెంట్లు చోటు చేసుకుంటున్నాయని, దీనికి కారణం మద్యం తాగి నడపడేనని తెలిపారు. జిల్లాలో ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రమాదాల బారిన పడుతున్న వారిలో 64శాతం మంది ద్విచక్ర వాహనదారులేనని అన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షితంగా ఉండాలన్నారు. పవర్ ప్రజెంటేషన్, పోలీసు కళా బృందాలచే ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మేఘన, ఆర్అండ్‌బీ డీఈ శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది, మెడికల్ కళాశాల డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మండలం సాధించే వరకూ పోరాడుతాం



తట్టెపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

పెద్దేముల్: తట్టెపల్లి పంచాయతీని నూతన మండలముగా ప్రకటించాలని మండల సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తట్టెపల్లి, బండమీదిపల్లి, ఓంలానాయక్‌తండాతో పాటు పలు గ్రామాల ప్రజలు తట్టెపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కొనసాగించారు. వీరి దీక్షలు 39వ రోజుకు చేరుకున్నాయి. వెనుకబడిన తట్టెపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకూ పోరాటం చేస్తామని ప్రకటించారు. కనీస వసతులు లేక దరిగడ్డ గిరిజన ప్రజలు కర్ణాటక రాష్ట్రం కుంచారం, షాదీపూర్ వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

తండాల్లోనే రేషన్ పంపిణీ

ఎమ్మెల్యే ఆనంద్



వృద్ధురాలిని పలకరిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: పట్టణ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మీతో నేను కార్యక్రమంలో భాగంగా సోమవారం వికారాబాద్‌లోని 11వ వార్డు కొట్టంగుట్టతండా, జాంబాపూర్‌తండా, గిరిగేట్‌పల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా వీధుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొట్టంగుట్టతండా, జాంబాపూర్‌తండాల్లో రేషన్ బియ్యం స్థానికంగా ఇచ్చే ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. మిషన్ భగీరథ పైపుల్లో లీకేజీలు ఉండొద్దని, కాలనీల్లో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, నీటి సమస్య ఎదురుకాకుండా చూడాలని సూచించారు. వార్డుల్లో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. నిత్యం చెత్తసేకరణ, డంపింగ్ పనులు చేపట్టాలని, ఇంటింటికీ చెత్త బండి వెళ్లేలా చూడాలని ఆదేశించారు. పాడుబడ్డ ఇళ్లను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ జీవన శైలిని అలవర్చుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: పర్యావరణ జీవన శైలిని అలవర్చుకోవాలని రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 'మిషన్ లైఫ్ –లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రతీక్ జైన్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ప్రతిజ్ఞ అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. పర్యావరణ జీవనశైలిని అలవర్చుకునేలా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం, నిషేధించాలని చెప్పారు. వర్షపు నీరు ఆదా చేయాలన్నారు. వీలైనంతగా ఏసీ తక్కువగా వాడాలని, సైకిల్‌ను ఉపయోగించాలని చెప్పారు. పర్యావరణ హిత జీవనశైలి గురించి చైతన్యపర్చాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఈలో ప్రతిభ

షాద్‌నగర్: పట్టణానికి చెందిన శివర్ధన్ ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐసీఎస్ఈ) పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని ముత్తంగిలో ఉన్న శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి (ఐసీఎస్ఈ) చదివాడు. ఈ పరీక్ష ఫలితాల్లో శివర్ధన్ 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించాడు. పర్సంటైల్‌లో 98.8 శాతం సాధించి దేశ స్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి శివర్ధన్‌ను పలువురు అభినందించారు.

ఓబీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నాగోలు శుభం కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 18న జరగనున్న బీజేపీ ఓబీసీ మోర్చా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఓబీసీ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తోందన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



తొండుపల్లిలో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

- రైతుల సమస్యలన్నీ తీరుస్తాం
- అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలు
- భూమి లేని ప్రతీ కుటుంబానికి ఏటా రూ.12 వేలు
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

పరిగి: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని.. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల సమస్యలన్నీ తీరుస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం తొండుపల్లి, చిట్యాల మీదుగా జిల్లేడ్‌చౌదరగూడెం మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా దారి పొడవునా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తొండుపల్లికి చెందిన రైతు సత్యనారాయణ పండించిన టమాటాలను రోడ్డు పక్కన పడేయడంతో.. పొలంలోకి వెళ్లి బాధితుడితో మాట్లాడారు. రూ.2 లక్షలు పెట్టి రెండెకరాల్లో టమాటా సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతు వాపోయాడు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతుల కోసం కోల్డ్ స్టోరేజీలు కట్టించడంతో పాటు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో.. ప్రజలకు కష్టాలు తప్పడం లేదన్నారు. జిల్లాకు కృష్ణా జలాలు రాకుండా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో జిల్లా రైతుల కోసం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తీసుకువస్తే ఆయన అధికారంలోకి రాగానే రద్దు చేశారన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరుతో ఇచ్చిన హామీలకు అతీగతీ లేకుండాపోయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిగిలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం కేసీఆర్ కేపీ లక్ష్మీదేవి ప్రాజెక్టును పూర్తి చేసి.. సాగు నీరు అందించాకే మళ్లీ వచ్చి ఓట్లు అడుగుతానని చెప్పారని గుర్తు చేశారు. రంగారెడ్డి, పాలమూరు రైతులను ఓట్లు అడిగే హక్కు ఆయనకు లేదన్నారు. తమ ప్రభుత్వం వస్తే అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టంచేశారు. భూమి లేని ప్రతి కుటుంబానికి ఏటా రూ.12 వేల సాయం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, తొండుపల్లి, చిట్యాల గ్రామాల సర్పంచ్ గీతాహన్మంత్‌రెడ్డి, రజితా, పార్టీ నాయకులు ఆంజనేయులు, శివకుమార్, నాగవర్ధన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె..

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 168 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా అధికారులు శాఖల వారీగా స్వీకరించిన అర్జీలపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలకు పక్కా భవనాలు



బషీరాబాద్‌లో పల్లె దవాఖానాకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- జిల్లావ్యాప్తంగా 29 మంజూరు
- ఒక్కో బిల్డింగ్‌కు రూ.20 లక్షల నిధులు
- మూడు నెలల్లో పూర్తికానున్న నిర్మాణ పనులు
- కలెక్టర్ నుంచి పీఆర్ ఇంజనీర్లకు ఆదేశాలు

మండలం	మంజూరైన భవనాలు
తాండూరు	7
పరిగి	5
బషీరాబాద్	4
యాలాల	4
పెద్దేముల్	3
ధారూరు	2
దౌల్తాబాద్	1
నవాబుపేట	1
దోమ	1
కొడంగల్	1

బషీరాబాద్: పల్లె దవాఖానాలకు ప్రభుత్వం శాశ్వత భవనాలను మంజూరు చేసింది. జిల్లాలో 29 భవనాల నిర్మాణానికి రూ.5.80 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇప్పటి వరకు సబ్ సెంటర్లుగా కొనసాగుతున్న వీటికి ఎక్కడా సొంత భవనాలు లేవు. దీంతో అద్దె భవనాలు, ప్రభుత్వానికి చెందిన ఇతర శాఖల భవనాల్లో నడుస్తున్నాయి. అయితే పల్లెల్లో వైద్యసేవలను విస్తరించాలనే లక్ష్యంతో.. ప్రభుత్వం వీటిని పల్లె దవాఖానాలుగా నామకరణం చేసి వైద్య సిబ్బందిని నియమిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నడిచే దవాఖానాల్లో 'మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్'గా డాక్టర్‌ను లేదా బీఎస్సీ స్టాఫ్ నర్సును నియమించి వైద్య సేవలు అందించనుంది. వీటికి శాశ్వత భవనాల కోసం జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఎఫ్ఎంఆర్ (ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రిపోర్ట్)ద్వారా రూ.5.80 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.20 లక్షలు కేటాయించారు. వీటిలో గత నెల మంజూరైన 11 భవనాలకు టెండర్లు పూర్తవగా, ఈ నెలలో మంజూరైన 18 భవనాలకు సోమవారం టెండర్లు పిలిచారు. ఇదిలా ఉండగా ఎన్నికలు సమీపిస్తుండటంతో రాబోయే మూడు నెలల్లో భవనాలు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి పంచాయతీ రాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. బషీరాబాద్ మండలానికి కొత్తగా మంజూరైన నాలుగు పల్లె దవాఖానాలకు తహసీల్దార్ వెంకటస్వామి, ఏఈ వంశీకృష్ణ స్థల పరిశీలన చేశారు. భవనాలు అందుబాటులోకి వస్తే వైద్య సేవలు మెరుగవుతాయని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

శివాజీ చౌక్‌ను సుందరీకరిస్తాం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



శివాజీ చౌక్ సుందరీకరణ పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

తాండూరు: పట్టణంలోని శివాజీ చౌక్‌ను సుందరీకరిస్తామని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శివాజీ చౌక్ అభివృద్ధి పనులను స్థానిక కౌన్సిలర్లు ఏ లలిత, ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో శివాజీ చౌక్ అంటేనే ప్రమాదాలకు నిలయంగా ఉండేదన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక ఈ రోడ్డు విస్తరణ పనులతో పాటు జాతీయ రహదారి ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. 293 మంది లబ్ధిదారులకు రూ. 3కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా 20 మంది లబ్ధిదారులకు రూ. 10.32లక్షలు పంపిణీ చేశారు.

విత్తనాల ధర ఖరారు

వికారాబాద్ అర్బన్: వానాకాలం సీజన్‌లో రైతులకు సరఫరా చేయాల్సిన విత్తనాల ధరలను తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఖరారు చేసినట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ కోటిలింగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులకు అవసరమైన జీలుగ, జనుము విత్తనాలపై 65శాతం ప్రభుత్వమే ఇస్తుందని, మిగతా 35శాతం రైతులు చెల్లించాలని తెలిపారు. వరి, కంది, పప్పు దినుసులు, మొక్కజొన్న, కుసుమ, నువ్వుల విత్తనాలకు రాయితీ లేకుండా విక్రయించనున్నట్లు తెలిపారు. రైతులకు ఈ ఏడాది కొత్తరకం వరి వంగడాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కుల్కచర్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రమేష్ కుమార్, ఎంపీడీఓ నాగవేణి హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కుల్కచర్లలో వివాదాస్పద స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణ దశలో ఉన్న భవనాన్ని వారు పరిశీలించారు. పనులు ఆపేయాలంటూ నిర్వాహకులకు సూచించడం తోపాటు నోటీసులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలోని స్థలం బీసీ కమ్యూనిటీ భవనానికి చెందుతుందని తెలిపారు. అక్రమ నిర్మాణంపై స్థానికులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి కోతలు

అకాల వర్షాలతో కొంత ఆలస్యం

- 30శాతం పంట కొనుగోలు కేంద్రాలకు..
- వరి కోత యంత్రాలకు పెరుగుతున్న డిమాండ్



గోకఫసల్‌వాద్ గ్రామంలో వరి కోతలు ప్రారంభించిన రైతు

దౌల్తాబాద్: మండలంలో వరి కోతలు కొంత ఆలస్యంగా ప్రారంభమైనా ప్రస్తుతం ఊపందుకున్నాయి. దీంతో వరి కోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడంతో రైతులు వరి కోతలను ముమ్మరం చేశారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో చేతికొచ్చిన పంటను ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయిస్తున్నారు.

అకాల వర్షాలతో ఆలస్యం

ఇటీవల కురిసిన వానలు రైతులను నట్టేట ముంచాయి. కోత దశకు వచ్చిన పంటలను అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి. మరో వైపు పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో వరి కోత యంత్రాలు దిగబడ్డాయి. దీంతో రైతులు పంట కోసేందుకు అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా మారడంతో తిరిగి కోతలు ప్రారంభించారు.

12వేల ఎకరాల్లో సాగు

మండలంలోని 33 పంచాయతీల్లో మొత్తం 12వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం వరి కోతలు ఊపందుకున్నాయని, ఇప్పటి వరకు 20నుంచి 30శాతం వరకు కోతలు పూర్తయినట్లు వారు తెలిపారు. మండల వ్యాప్తంగా ధాన్యం సేకరణకు పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే చాలా మంది రైతులు వరి పంట కోసిన తర్వాత నూర్పిడి చేసి ఆరబోయకుండా కేంద్రాలకు తరలిస్తుండడంతో మద్దతు ధర వచ్చే అవకాశం లేకుండా పోయింది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే ముందు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటిస్తే మంచి ధర వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు.

అకాల వర్షాలతో ఆలస్యం



నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. రెండు రోజుల క్రితం కోతలు పూర్తయ్యాయి. అకాల వర్షాల కారణంగా ఈ సారి కోతల్లో ఆలస్యం జరిగింది. ప్రస్తుతం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించా. నిబంధనల ప్రకారం తేమశాతం రాగానే పంటను విక్రయిస్తా.

– జనార్దన్‌రెడ్డి, నందారం, రైతు

30శాతం కోతలు పూర్తి



మండలంలో ఈ యాసంగిలో 12వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇప్పటి వరకు 30శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. అకాల వర్షాల కారణంగా సకాలంలో పంట చేతికి రాలేదు. మరో 15 రోజుల్లో వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉంది.

– లావణ్య, ఏఓ

యువత క్రీడల్లో సత్తా చాటాలి

యూత్ వెల్ఫేర్ జిల్లా అధికారి హన్మంత్‌రావు

బంట్వారం: గ్రామీణ యువత క్రీడల్లో సత్తా చాటాలని యూత్ వెల్ఫేర్ జిల్లా అధికారి హన్మంత్ రావు సూచించారు. చీఫ్ మినిస్టర్ కప్ –2023లో భాగంగా సోమవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. క్రీడా పోటీల నిర్వహణపై ఆరా తీశారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి విద్యార్థులు, యువకులు క్రీడల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలన్నారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఆయన సూచించారు. ఇలాంటి పోటీలతో యువతలోని నైపుణ్యం బయటికి వస్తుందన్నారు. చీఫ్ మినిస్టర్ కప్ – 2023లో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు ఉంటాయన్నారు. మండల, జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, జెడ్పీటీసీ సంతోష, ఎంపీడీఓ బాలయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ చంద్రప్ప, సూపరింటెండెంట్ షిండే, సీహెచ్‌ఓ విజయ్‌కుమార్, జేఏ షఫీ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు పకడ్బందీగా నిర్వహించాలి

అనంతగిరి: చీఫ్ మినిస్టర్ కప్ –2023 పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ జానకీ రెడ్డి అధికారులకు సూచించారు. వికారాబాద్ మండల స్థాయి క్రీడా పోటీలు మంగళ, బుధవారాల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని నారాయణపూర్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం జరగనున్న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఆహ్లాదకర వాతావరణంలో పోటీలు జరిగేలా చూడాలన్నారు. ఈ పోటీల్లో యువతీయువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని చాటాలన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, ఉపాధి హామీ పథకం ఏపీఓ శీను, ఐకేపీ ఏపీఎం లక్ష్మయ్య, పంచాయతీ సీనియర్ కార్యదర్శులు రాములు, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: క్రీడా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ తదితరులు

పల్లెల్లో కనీవిని ఎరుగని అభివృద్ధి



దోర్నాల్ గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

ధారూరు: గ్రామీణ ప్రాంతాల్లో కనీవిని ఎరుగని అభివృద్ధి జరుగుతోందని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ. 2.50 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మీతో నేను కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని అంతారం, గురుదోట్ల, మోమిన్‌కలాన్, కుమ్మర్‌పల్లి, తరిగోపుల, మోమిన్ ఖుర్దు, నాగారం, దోర్నాల్, రాజాపూర్, నాగ్‌సాన్‌పల్లి, పీసీఎం తండా, అంపల్లి, దోర్నాల్ తండా, మైలారం గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ఆనంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, నాయకులు సుజాత, చంద్రమౌళి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, విశాల, వెంకటయ్య, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సర్కార్ ప్రోత్సాహం

- 615 మండల కేంద్రాల్లో సీఎం కప్ క్రీడాపోటీలు
- 17 వేల క్రీడా ప్రాంగణాల నిర్మాణం
- గుడి, బడిలాగే క్రీడా మైదానాలను గౌరవించాలి
- శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్



మాట్లాడుతున్న ఆంజనేయగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ అన్నారు. సోమవారం రంగారెడ్డిజిల్లా బాటసింగారంలో అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం సీఎం కప్–2023 క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 615 మండల కేంద్రాల్లో క్రీడా పోటీలు ప్రారంభమైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో 17వేల క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు భారీ నగదు, విలువైన ఇళ్ల స్థలాలను ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఉద్యోగాల్లో రెండు శాతం, ప్రొఫెషనల్ కోర్సుల్లో రిజర్వేషన్లను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 1.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు మరో లక్ష ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సాగుతోందని వివరించారు. ఐటీకి అడ్డాగా మారిన తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు దక్కుతున్నాయని ఆయన వివరించారు. భారీ పరిశ్రమలను జిల్లాలకు సైతం విస్తరించడం వల్ల గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటుతున్నారని, నిఖత్ జరీన్ తదితరులను ఆయన ఉదహరించారు. గుడి, బడిలాగే క్రీడామైదానాలను గౌరవించాలని, క్రీడా ప్రాంగణాల కేర్ టేకర్లుగా యువకులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖా, జడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడల శాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ అనితా రెడ్డి, ఎంపీడీఓ మమతాబాబు, ఎంపీఓ వినోద, మండల విద్యాశాఖాధికారి హీర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 212 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవడానికి వస్తుంటారని, అలాంటి వారి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. అంతకు ముందు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ –3, గ్రూప్ –4 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కలెక్టర్.. స్టడీ మెటీరియల్ అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

2023 – 24 అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్ శిక్షణ పొందేందుకు జిల్లాలోని బీసీ కులాలకు చెందిన లా గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బేసిక్ డిగ్రీతో పాటు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి లా పట్టా పొంది ఉండాలన్నారు. జూలై 2022 నాటికి 23 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వారు దరఖాస్తులకు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంతం వారి వార్షిక ఆదాయం రూ. 1.50లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ. 2లక్షల లోపు ఆదాయం ఉండాలన్నారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు మూడేళ్ల పాటు శిక్షణ పొందాల్సి ఉంటుందని తెలిపారు. శిక్షణ కాలంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. దరఖాస్తు ఫారాలు కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో ఈ నెల 16 నుంచి పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ లోపు నేరుగా బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

గిరిజన బాల బాలికల నుంచి..

2023 – 24 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవేలబుల్ పాఠశాలలో 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలకు గిరిజన బాల బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 45 ఖాళీలు ఉన్నాయని, 3వ తరగతిలో 22, 5వ తరగతిలో 12, 8వ తరగతిలో 11 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 18నుంచి కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 2వ తేదీ సాయంత్రం 5గంటల లోపు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. జూన్ 7న లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

డబ్బు, సెల్‌ఫోన్ కోసం..

అడ్డాకూలీ హత్య

మొయినాబాద్: డబ్బు, సెల్‌ఫోన్ దొంగిలించేందుకు ఓ అడ్డా కూలీని ఇద్దరు దుండగులు హత్య చేశారు. ఈ ఘటన మొయినాబాద్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరెడ్డి తెలిపిన ప్రకారం.. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం ఒత్తుగండ్ల గ్రామానికి చెందిన సతీష్(40) భార్యతో కలిసి రెండేళ్ల క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చారు. ముస్లింబస్తీలో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి సతీష్ పట్టణంలో ని కాశీనాథ్ గ్రౌండ్‌లో మద్యం సేవిస్తూ కూర్చు న్నాడు. అదే సమయంలో మండలంలోని పెద్ద మంగళారం గ్రామానికి చెందిన దేవేందర్ మరో వ్యక్తి అక్కడికి వచ్చి మద్యం సేవించారు. సతీష్ వద్ద ఉన్న రూ.8వేల నగదున్నట్లు గమనించిన దుండగులు ఆయన తలపై సిమెంట్ ఇటుకతో మోది హత్య చేశారు. సెల్‌ఫోన్, నగదు దోచుకున్నారు. సోమవారం అటుగా వెళ్లినవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. దేవేందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేశానని ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మీరే మాకు ఆదర్శం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి సేవలను కొనియాడిన భట్టి విక్రమార్క



భీంరెడ్డిని ఆలింగనం చేసుకుంటున్న భట్టి విక్రమార్క

కుల్కచర్ల: పదవిలో ఉన్నా లేకున్నా 40 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన మీ లాంటి నాయకులే మాకు ఆదర్శమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క.. డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డిని కొనియాడారు. సోమవారం పరిగి మండలంలో భట్టి పాదయాత్ర సాగింది. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి నేతృత్వంలో కుల్కచర్ల మండలానికి చెందిన పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉన్న భీంరెడ్డి లాంటి నేతలు పార్టీకి కొండంత బలమన్నారు. ఆయన చూపుతున్న ఉత్సాహం మాకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పార్టీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ అంజిలయ్య, చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడు నరసింహనాయక్, నాయకులు షర్ఫుద్దాన్, కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు

డీఎస్పీ శేఖర్‌గౌడ్



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు: విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని గొల్లచెరువు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో అహ్లే సున్నత్‌వాల్ జమత్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వేసవి విద్యా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు, పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. సెల్‌ఫోన్ల వల్ల పిల్లలు చదువుకు దూరమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి రూ. వెయ్యి, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 500 నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రామకృష్ణ, అసోషియేషన్ అధ్యక్షుడు మహ్మద్ గౌస్ బాబా ఖాద్రీ, ఉపాధ్యక్షుడు జమీర్, కార్యదర్శి ఫజల్, ప్రతినిధులు మునీర్‌ఖాన్, ఎండి, కుద్దూస్, మజీద్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో ఎకరానికైనా నీళ్లిచ్చారా?

- ప్రాణహిత– చేవెళ్లను నిర్వీర్యం చేశారు
- కాళేశ్వరం ప్రాజెక్టు చెక్‌డ్యామ్‌లకే పరిమితం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం



లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు స్థలం వద్ద మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కొందుర్గు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నిధులు, నీళ్లు, నియామకాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ మాట తప్పారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు స్థలం వద్ద ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టును రూపకల్పన చేశారని, అయితే సీఎం కేసీఆర్ ప్రాణహిత ప్రాజెక్టును చంపేశారని విమర్శించారు. జూరాల నుంచి నీళ్లు తరలించి సముద్రానికి 675 మీటర్ల ఎత్తులో ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గం లక్ష్మీదేవిపల్లి వద్ద పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తే మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని ఉద్దేశంతో కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జీఓ విడుదల చేసినట్లు తెలిపారు. అలాంటి ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం ఇక్కడ సాగునీరు కాదు తాగునీరు ఇస్తామని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ తన తొమ్మిదేళ్ల పాలనఅదనంగా ఒక్క ఎకరానికై నా సాగునీరు ఇచ్చారా అని ప్రశ్నించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు తమ మానసపుత్రిక అని, ప్రాజెక్టు నిర్మించకుంటే ఓట్లు అడగమని చెప్పిన ఎమ్మెల్యే, ఎంపీలు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు.

రాష్ట్ర వాటాను వినియోగించుకోవడం లేదు

రాష్ట్రానికి వచ్చే సాగునీటి వాటాను వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. కృష్ణా జలాల్లో 70శాతం నీళ్లు వాడుకోవాల్సి ఉండగా.. కనీసం 30శాతం కూడా వాడుకోవడం లేదన్నారు. ప్రాజెక్టుల విషయంలో తమ సూచనలను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వికారాబాద్ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ప్రజాగాయకుడు గద్దర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



కళావతి (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన మర్ల కృష్ణ కుమార్తె కళావతి(19) ఎనిమిదో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 13న కృష్ణ దంపతులు పని నిమిత్తం బయటికి వెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి యువతి కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం రాత్రి కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.